క్లుప్తంగా

పాతూరు ఆలయంలో ప్రత్యేక పూజలు

కనిగిరిరూరల్: స్థానిక పాతూరులోని రామాలయం గుడి వద్ద జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ గురువారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ స్వామికి విశిష్ట పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమామన్ని ప్రారంభించారు. కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసులు యాదవ్, ఆవుల కాశిరెడ్డి, మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, ఎల్ఐసీ నారాయణ, బీసీ సంఘం నాయకులు పల్లా మాలకొండయ్య, చెరుకూరి నరసింహారావు, సీదా మాల కొండయ్య, నజీర్ బాషా పాల్గొన్నారు.

నేడు జ్యోతీరావు పూలే జయంతి

కనిగిరిరూరల్: సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల అనుబంధ సంఘాల నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

పామూరు: పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా అకాల వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షంతో అటు బత్తాయి, నిమ్మ సాగు రైతులతో పాటు పశుపోషకులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. కాగా విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం నెలకొంది.

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి


కుంచాల శ్రీను మృతదేహం

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు మానసిక వికలాంగుడు, వృద్ధుడు కుంచాల శ్రీను(70) మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం రమ్యవైన్స్ షాపు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మృతుడు కుంచాల శ్రీను రమ్యవైన్స్ షాపులో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు కాలికి రాయి తట్టుకుని ముందుకు పడ్డాడు. ఈ ఘటనలో అతను మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్ స్టాక్ పాయింట్ పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు త్వరలో పంపిణీ చేయనున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ స్టాక్‌పాయింట్ అయిన జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్‌రావు, సీఎంఓ సోనీరూత్‌లు తనిఖీచేశారు. ఈసందర్భంగా పాఠశాల గదుల్లో బుక్స్‌ను ఉంచేందుకు అనువైన పరిస్థితులు, వసతులు, భద్రతలపై ఎంఈఓ జె.ప్రసాదరావుతో చర్చించారు. నెలాఖరులోగా పాఠ్యపుస్తకాలు పంపిణీకి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎంఐఎస్ దీప్తి, సీఆర్‌యంటీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరిరూరల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణపై డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ గురువారం ఆర్టీసీ, పోలీస్ అధికారులతో సమీక్ష చేశారు. ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోనే తిప్పడం వల్ల, పార్కింగ్ చేయడం వల్ల పట్టణ ప్రధాన రోడ్లల్లో కూడళ్లలో కల్గుతున్న ట్రాఫిక్ అంతరాయాన్ని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై టి.శ్రీరాం, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

కొండపి: మండలంలోని స్థానిక హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వెనుక జామాయిల్ తోట దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఫైర్ అధికారి వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం బొడ్డపాటి చిన్నబ్బి, బొడ్డపాటి వెంకటేశ్వర్లు పొలంలో జామాయిల్ సాగు చేశారు. ప్రమాదవశాత్తు అగ్గిరాజుకోవడంతో, ఎండాకాలం కావడంతో వేడిమికి మంటలు వ్యాపించాయి. సమాచారం అందించిన వెంటనే అగ్నిమాపక శాకాధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపుచేశారు. మంటలు వ్యాపించిన ప్రదేశానికి కొంచెం ముందుగా హెచ్.పీ గ్యాస్ గోడౌన్ ఉందని, ప్రజలు సిబ్బంది అప్రమత్తతో మంటలు వ్యాపించకుండా అదుపు చేశామని తెలిపారు.

దాహం కేకలు..!

- వారం రోజులుగా నిలిచిన రామతీర్థం నీటి సరఫరా
- 32 గ్రామాల ప్రజలు నీటి ఇక్కట్లు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- వేసవిలో తాగు, వాడుక నీటికోసం అల్లాడుతున్న గ్రామస్తులు


తాగునీటి పథకం వద్ద నీరు తోడుకుంటున్న గ్రామస్తులు


మంచినీరు మోసుకుపోతున్న దృశ్యం

మర్రిపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడంలేదు. మండలంలో గత వారం రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలో 32 గ్రామాల ప్రజలకు వారం రోజులుగా తాగునీరు అందక అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నీటి సమస్యను పట్టించుకోకుంటే వేసవితాపం తీరేదెలా 'స్వామి' అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు.

రూ. 91 కోట్లతో రక్షిత మంచినీటి పథకం

దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో జిల్లా పర్యటన చేశారు. ఆ సమయంలో ప్రకాశం జిల్లా అత్యంత ఫ్లోరైడ్ ప్రాంతంగా గుర్తించారు. స్పందించిన మహానేత అనుకున్నదే తరువుగా చీమకుర్తి సమీపంలోని రామతీర్థం రిజర్వాయర్ నుంచి మర్రిపూడి మండలం మీదుగా కనిగిరి, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాలకు శుద్ధజలాలు అందించే లక్ష్యంతో రూ. 91 కోట్లు మంజూరు చేశారు. అందులో భాగంగా మర్రిపూడి గ్రామ శివారులో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసేందుకు రూ. 5 కోట్లు వెచ్చించి, ఫిల్టర్‌బెడ్లు, గ్రౌండ్ ఫ్లోర్, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించారు. ప్రతి రోజు 2 లక్షల లీటర్లు తాగునీరు శుద్ధి చేసి పైపులైన్ ద్వార మండలంలోని 32 గ్రామాల ప్రజలకు శుద్ధ జలాలు అందించి దాహం తీర్చారు. అయితే కూటమి ప్రభుత్వ తమ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లుపొడిచి పథకాన్ని నీరుగారుస్తున్నారు.

వారం రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా

గ్రామ శివారులో రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచి నీటి పథకం ప్రస్తుతం వెలవెలబోతుంది. పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో గత వారం రోజులుగా మండలంలోని 32 గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో మండలంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వాడుక, పశువులకు సైతం నీరు లేక తల్లడిల్లిపోతున్నారు. కొందరు మర్రిపూడి శివారులో ఉన్న రక్షిత మంచి నీటి పథకం వద్దకు వెళ్లి గ్రౌండ్ ఫ్లోర్ ట్యాంక్ ఎక్కి తాళ్ల సహాయంతో నీరు లాక్కుంటున్నారు. మహిళలు, చిన్నారులు సైతం ప్లాస్టిక్ బక్కెట్లు, బిందెలు, బబుల్స్ సహాయంతో మోసుకుపోతున్నారు. కొందరు ద్విచక్రవాహనాలపై తీసుకెళుతున్నారు. నీటికి కోసం దాదాపు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం మండల వాసులు తహతహలాడుతుంటే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని మండల వాసులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు.


మరమ్మతులుకు గురైన తాగునీటి పథకం ట్రాన్స్‌ఫార్మర్

తాగునీటి సరఫరా విషయమై ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ జైపాల్‌ను వివరణ కోరగా, ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి తాగునీరు నిలిచిపోయిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువచ్చినా పనిచేయలేదన్నారు. మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి



జరుగుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


కొండపిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విక్టోరియా రాణి

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటమే లక్ష్యంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ మల్లీశ్వరి, డాక్టర్ కావ్య, స్నేహ మాధురి, సూపర్‌వైజర్లు

సింగరాయకొండ: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీఓ డి. జయమణి అన్నారు. మండలంలోని శానంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఆదిపోగు సుమతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: మండలంలోని జమ్మలమడక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. పోషకాహార పక్షోత్సవాల లోగోను సూపర్‌వైజర్ పార్వతి ఆవిష్కరించారు. హెచ్‌ఎం పి సురేష్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త పి.భాగ్యలక్ష్మి, జి,రాజేశ్వరి, పి.నాగమల్లేశ్వరి, ఎం వెంకటలక్ష్మి, ఎం కోటేశ్వరి పాల్గొన్నారు.

మర్రిపూడి: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలని మర్రిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి వీరబాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పోషణపక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులతో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోగా తల్లిముర్రుపాలు తాపించాలన్నారు. సూపర్‌వైజర్ సుచరిత, డీపీఎం లెప్రసీ ప్రసాదురావు, హైమావతి, సుదేష్ణా, కామేశ్వరి, ఉమా విజయ లక్ష్మి ఉన్నారు.

కొండపి: మండలంలోని దాసిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ పక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నెల్లూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విక్టోరియా రాణి, గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు.

దశదినకర్మలో పాల్గొన్న డాక్టర్ వెంకయ్య


తులసమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

కొండపి: మండలంలోని అనకర్లపూడి గ్రామానికి చెందిన వైఎస్ ఎంపీపీ వేముల ప్రసాద్ తల్లి వేముల తులసమ్మ అనారోగ్యంతో కొన్ని రోజుల క్రితం మరణించింది. గురువారం స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని తులసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు, యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్, మాజీ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, వేముల రమేష్, మండవ మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దద్దాల ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: అనారోగ్యంతో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథ పిల్లలైన వారికి, కిడ్నీ వ్యాధిగ్రస్తునికి, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మూడు కుటుంబాల వారికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ గురువారం ఆర్థికసాయం అందజేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుడు సాధు రమణయ్యకు రూ.15 వేలు, దుగ్గెం రూప కుటుంబానికి, వారి పిల్లలు రిబ్కా, బాలరాజుకు రూ.10 వేలు, విలియం కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఆయన వెంట మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మండల సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సర్పంచ్ మద్దిరత్తాలు, సచివాలయ కన్వీనర్ మద్ది తిరుపతయ్య, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినాయణరెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ఏరువ వెంకటరెడ్డి ,ఎంపీటీసీ సభ్యులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేంత వరకు పోరాటం


మాట్లాడుతున్న సయ్యద్ యాసీన్

కనిగిరిరూరల్: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో గురువారం సామూహిక దీక్ష నిర్వహించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి జీపీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, ఇంటి స్థలం, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా పేద వర్గాలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. నేటికి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరని తీవ్రంగా ఎండగట్టారు. చాకిరాల వద్ద ఇచ్చిన టిట్కో గృహాల లబ్దిదారులకు 1286 మందికి అప్పగించాలని, అజీస్ పురం సర్వే నెంబర్ 541లో నివాసం ఉంటున్న 40 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, పొగాకు బోర్డు వెనుక యల్లమందారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు 150 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ అధికారికి అందచేశారు. పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు సయ్యద్ మౌలాలి, రమేష్, పండిటి మోహన్, జి.బాలిరెడ్డి, రామాంజి, కరుణానిధి, గుజ్జుల బాలిరెడ్డి, జూపల్లి కోటేశ్వరరావు, ఎస్కే పైపెద మస్తాన్, ఖాశింపీరా, పుట్టా సుబ్బారావు, సయ్యద్ షరీఫ్, పవన్ కళ్యాణ్, అంకమ్మ, సూరిబాబు, కనమర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు


పొట్టిరెడ్డిపాలెంలో పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


వేమవరంలో గాలులకు సగానికి విరిగిపోయిన విద్యుత్ స్తంభం

మర్రిపూడి:

మండలంలో గురువారం వీచిన ఈదుగారులకు విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. మండంలోని కూచిపూడి, పొట్టిరెడ్డిపాలెం, దుగ్గిరెడ్డిపాలెం గ్రామాల్లో ఒక్కోటి చొప్పున మూడుట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయాయి. అలాగే వేమవరంలో ఒక విద్యుత్ స్తంభం, గార్లపేట గ్రామంలో రెండు స్తంభాలు, దుగ్గిరెడ్డిపాలెంలో రెండు, కూచిపూడి పొలాలల్లో మరో 2 విద్యుత్ స్తంభాలు సగానికి విరిగి పడిపోయాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మండలంలో మరి కొన్ని స్థంభాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు.

వైభవంగా వసంతోత్సవం


వాలచర్లలో సీతారాముల పల్లకి మోస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వాలిచర్లలో సీతారాముల కల్యాణ వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు గాండ్ల పర్తి వెంకటేశ్వరెడ్డి, సర్పంచ్ కత్తి మరియబాబు, ఎంపీటీసీ గాలం నాగేశ్వరరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కనిగిరిరూరల్: విద్యార్థి, యువత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ రామాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి, యువత సమస్యలపై ఈ నెల 13న దర్శిలో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి విద్యార్థి, యువజన సమాఖ్య నాయకులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సీహెచ్ పవన్ కళ్యాన్, జి.బాలిరెడ్డి, జీపీ రామారావు, ఎస్కే ఖాశింపీరా, పుట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలి


జరుగుమల్లిలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జరుగుమల్లి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన మనోహర్‌రావు, పిన్నిక శ్రీనివాసులు, ఎంపీటీసీ భిక్షాలు, గ్రామ ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుబ్బారెడ్డి, రూబేను, శ్యాంసన్, కొండూరు సుబ్బారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

జీవనోపాధుల నివేదికలు తయారు చేయాలి

కొండపి: స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆర్థిక, జీవనోపాధుల ప్రణాళికలు సక్రమంగా తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్న వీఓఏలు పనితీరును మెరుగుపరుచుకొని సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమం నిమిత్తం ఎంపిక చేసిన ఎన్యుమరేటర్లు కూడా వారికి కేటాయించిన 50 నుంచి 60 కుటుంబాలను సందర్శించి కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి నివేదిక తయారు చేయాలని సూచించారు. రుణాలు సకాలంలో వసూలు చేయాలన్నారు,. ఏపీఎం బి.గోపీనాథ్, సీసీలు డి.మల్లికార్జున, కె.రామానుజల, కె.రమణమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు యాళ్ల వెంకటరెడ్డి


యాళ్ల వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: కనిగిరి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దివంగత యాళ్ల వెంకట రెడ్డి చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. స్థానిక కొత్తూరులో యాళ్ల వెంకటరెడ్డి దశదిన కర్మ గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి నీటి సంఘ అధ్యక్షునిగా యాళ్ల వెంకట రెడ్డి రైతులకు అనేక సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, న్యాయవాదులు, కౌన్సిలర్లు, పిల్లి వెంకటేశ్వరరెడ్డి, వై శ్రీకాంత్‌రెడ్డి, పిల్లి తిప్పారెడ్డి, తమ్మినేని శ్రీరాములరెడ్డి, తమ్మినేని ఉమా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సిబ్బంది ఇంటింటి ప్రచారం

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది విద్యార్థుల అడ్మిషన్ల కోసం గురువారం పొన్నలూరు, కోటపాడు, రాజోలుపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కళాశాల సమాచారంతో ముద్రించిన కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు మాట్లాడుతూ కళాశాలకు పక్కా భవనంతో పాటు అన్ని రకాల వసతులు ఉన్నాయని, మండలంలో పది పూర్తైయిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాల్లో చేరాలన్నారు.